

'గోదావరి వంతెన' —కె. యస్. వి. ప్రసాద్

# రాజమండ్రీ నోటులు - బాలగంగాధరతిలక్

1

వరదకన్న ముందు భయం పెనువరదలాగ వచ్చింది
భయంమీద రాజమండ్రీ తెప్పలాగ తేలుతోంది
అంచులు మోసిన గోదావరి ఆకాశం కిందికి దిగినట్టు వుంది
ముచ్చటగా రైలువంతెన ముత్యాల వడ్డాణంలా అమరింది
ఇంకొంచెం ప్రమాణం హెచ్చితే ఎక్కడుంది రాజమహేంద్రవరం
మానవుల గర్వం నగరాలనద్వం ప్రకృతిముందు శ్రీకృష్ణార్పణం.

2

ఊరంతా అదుర్దా ఊదారంగులో తిరుగుతోంది
గుడిసెల్ని చూస్తే పాపం మేడల కేవిటో నామర్దా!
కన్నీరుకీ పన్నీరుకీ మున్నీరుకీ నీరు సమానం
అయితే గోదావరి ఏనీరు - ఏడ్పనీరు, చావనీరు!

3

అర్ధరాత్రి వేళ
వానలో చలిగాలిలో
అంతపెద్దనగరమూ వణకిపోతోంది
మధ్య మధ్య
మసక మసక విద్యుద్దీపాలు
వృద్ధ నగరమాత చత్వారపు నేత్రాలు
వానలో చలిగాలిలో
నిద్రలో నిశ్శబ్దంలో
క్షతగాత్ర అయిన హర్యక్షంలా మూల్గుతోంది.
మెరక వీధి యిసుక వీధి
యీగలు వాలుతూన్న పెద్దపెద్ద వ్రణాలు
వీరేశలింగం దామెర్ల రామారావ్
స్మృతులేవో కదలిన యీక్షణాలు
సింహం కళ్ళనుండి జారిన అశ్రుకణాలు
అర్ధరాత్రివేళ వానలో చలిగాలిలో
రాజమండ్రీ పాపాన్ని కప్పుకుని పడుకుంది!



రోడ్లు:

ఎగుడూ దిగుడూ
పెళ్ళాం మొగుడూ
వీరికి ప్రణయం
మనకే ప్రళయం.

కొండలు:

5

నల్లమందుతిన్న గున్న ఏనుగుల్లాగ కొండలు
ఎక్కడి పక్కడ మత్తుగా పడుకుంటాయి
సారంగధరుడి మెట్టదగ్గర మాత్రం
సంగీతం విషాదంగా వినిపిస్తుంది
నీతి కట్టెలాంటిది
కోర్కె మంటలాంటిది
అందుకే రాజరాజు కొంపకి నిప్పంటుకుంది.

6

రాత్రివేళ రాజమండ్రీ వెళుతూంటే
రమ్య గౌతమీ జలాలలో
కొన్నివేల విద్యుద్దీపాలు ప్రతిఫలిస్తాయి
ఎవరీవిడ ధమ్మిల్లంలో యిన్ని కాంతి లతాంతాల్ని తురిమారు?
ఎవరీవిడ గుండెల్లో యిన్ని కాంక్షాకీలల్ని వెలిగించారు?
అని విస్తుపోతాను
అయితే అప్పుడు గౌతమి ఎంత అందంగా వుంటుంది
నాట్యంచేసి అలసిన వేలుపు సానిలాగ!
అర్థశయాన మూర్తి అయిన రాణిలాగ!

7

గీష్మంలో:

రెల్లుపూల బార్డర్ వేసిన
నీలాల నీటి నైలాన్ చీర
వొంటిమీదనుంచి జారుతూండగా
రాజమండ్రీ అనే యువతి
సందులూ గొందులూ ఎండలో తిరిగి
విసుగెత్తి
వెనుక తానుండే గొప్పతనం మేద ఎక్కడా కనుపించక
చిన్నబుచ్చుకుని
అలసిన కాళ్ళనీడ్చుకుంటూ వెళ్ళి
దూరంగా
కొండల పక్కన నీడలలో కూర్చొని
కొబ్బరి నీళ్ళు తాగుతోంది.

8

రాజమండ్రీలో సాహిత్య సుందరి
అందెలూ బావిలీలూ యింకా మానలేదు.
కొంచెం మడిగా చేసి పెడుతుంది
భోజనంలోకి పాత చింతకాయపచ్చడి
వంగ వరుగు పులుసూ
రుచిమాట దేవుడెరుగును కానీ
మాంచి ఆరోగ్యం తినగలిగిన పెద్దమనిషికి!
యువకులూ నడివయస్కులూ కూడా
దేవతార్చనకి అక్కడికే వెళుతున్నారుట!
సెంట్లూ అత్తర్లూ
స్నోలూ పౌడర్లూ
వాడదు, సినీమాలూ, క్లబ్బులూ
చూడదావిడ;
వృద్ధపతి సార్వభౌముల
క్రుద్ధలోచన గోళ నిర్గత
శాసనా బద్ధయై, రుద్ధయై, ముగ్ధయై!

